ప్రజాశక్తి

గురువారం 22 ఫిబ్రవరి 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

అభ్యర్థుల్లో ఆర్థికమే కీలకం

టిక్కెట్ల కేటాయింపులో సాధారణ నేతలకు నోఛాన్స్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రస్తుతం ఉన్న ప్రధాన అర్హత ఆర్థిక స్థోమత కీలకంగా మారింది. సాధారణ అభ్యర్థులను ఎంపిక చేస్తున్న పరిస్థితి ఉమ్మడి జిల్లాలో ఈసారి మచ్చుకయినా కన్పించడం లేదు. ప్రధాన పార్టీలు వైసిపి, టిడిపిలు అభ్యర్థుల ఎంపికలో భారీగా పెట్టుబడి పెట్టేవారికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. పార్టీ కోసం ఎంత కష్టపడ్డారు? పార్టీని అంటిపెట్టుకుని ఎన్ని ఏళ్ల నియోజకవర్గానికి సేవలందించారు? పార్టీ నాయకులతో ఉన్న సత్సంబంధాలు తదితర అంశాలు వేటిని పరిగణలోకి తీసుకోవడం లేదు. కేవలం ఆర్థిక స్థోమత ఉందా లేదా అన్న కోణంలోనే వైసిపి అభ్యర్థుల ఎంపికను చేపట్టింది. అంతేగాక తాను మీరు అడిగినంత ఖర్చుపెట్టలేనని నిష్కర్షగా చెప్పిన అభ్యర్థులకు టిక్కెట్ ఇవ్వలేమని అధిష్టానం స్పష్టం చేస్తోంది. గుంటూరు ఎంపిగా అభ్యర్థుల ఎంపికలో జాప్యానికి ఇదే కారణంగా నిలిచింది. దీంతో పార్టీలో సీనియర్ అయినా స్థానికంగా మీకు వ్యతిరేకత ఉంది. మీరు గెలవలేరు అనే అంశాన్ని ఒక సాకుగా చూపుతున్నారు.ఒక చోట చెల్లని కాసు మరో చోట చెల్లుతుందా అని ప్రత్యర్థుల నుంచి విమర్శలు వచ్చినా ఏమాత్రం వెనుకంజ వేయలేదు. ప్రస్తుతం జిల్లాలో ఎంపిక చేసిన అభ్యర్థుల్లో ఒకరిద్దరు తప్ప మిగతా వారంతా ఆర్థిక అంశాలే కీలకంగా ఎంపికలు జరిగాయి. ఒకరిని చూసి మరొకరు పోటీ పోటీగా అసెంబ్లీ స్థానానికి అయితే రూ.30 నుంచి రూ.40 కోట్లు, పార్లమెంటుకు అయితే రూ.100 నుంచి రూ.150 కోట్లు ఖర్చు చేయాలని షరతుపెట్టి అభ్యర్థుల ఎంపిక చేస్తున్నారు. వైసిపి బాటలోనే టిడిపి కూడా పయనిస్తోంది. పార్టీలో సీనియారిటీ కంటే



ఎంత ఎక్కువ ఖర్చు చేస్తారు? అనే అంశానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. పార్టీలో ఏళ్ల తరబడి పనిచేసిన వారి కన్నా ప్రత్యర్థిపార్టీ కన్నా ఎక్కువ ఖర్చుపెట్టగల స్థోమత ఉన్న వారికి అవకాశం ఇస్తున్నారు. ఎన్ఆర్ఐలు, రియల్టర్లు, కార్పొరేట్ వ్యాపార దిగ్గజాలకు రెడ్ కార్పెట్ వేస్తున్నారు. దీంతో పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడిన వారిని కనీసం కూర్చొబెట్టి మాట్లాడిన పరిస్థితులు లేవు. వేర్వేరు కారణాలతో మీకు

2లో

ఆస్తి కోసం కత్తి దూసిన దత్తపుత్రుడు

తండ్రి మృతి.. విషమంగా తల్లి పరిస్థితి - పిడుగురాళ్లలో ఘాతుకం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

జాగ్రత్తగా కాపాడతాడు అనుకున్న దత్తకుమారుడే కాలయముడుగా మారాడు. జాగ్రత్తగా పెంచిన తల్లిదండ్రులపై ఆస్తికోసం కత్తి దూశాడు. ఈ దారుణ ఘటనతో పిడుగురాళ్ల పట్టణం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. పోలీసుల వివరాల ప్రకారం... పట్టణంలోని 12వ సచివాలయం పక్కన నివాసం ఉంటున్న నీటిపారుదల శాఖలో లస్కర్‌గా రిటైర్ అయిన మచ్చు యోహాను (64), చిట్టెమ్మ దంపతులకు పిల్లలు లేకపోవడంతో సోదరుని కుమారుడైన అంబేద్కర్‌ను దత్తత తీసుకున్నారు. చిన్నప్పటి నుండి సొంతబిడ్డలా చూసుకోవడంతోపాటు పెళ్లి కూడా చేశారు. ఒకే భవనంలో కింది అంతస్తులో యోహాను దంపుతులు ఉంటుండగా, పై అంతస్తులో అంబేద్కర్ తన కుటుంబంతో ఉంటున్నాడు. వ్యసనాలకు బానిసైన అంబేద్కర్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటకలోనూ పలుమార్లు చోరీలకు పాల్పడి జైలుకూ వెళ్లి వచ్చాడు. ఎంత చెప్పినా



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

అంబేద్కర్ ప్రవర్తన మారకపోవడంతో కొంతకాలంగా యోహాను దంపతులు అతనితో మాట్లాడ్డం మానేశారు. దీంతో ఆస్తి తనకు దక్కదేమోనని భావించిన అంబేద్కర్.... యోహాను దంపతులపై తరచూ గొండవ పెట్టుకుంటున్నాడు. ఆస్తిని తన పేరున రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మరోసారి గొడవపెట్టుకుని యోహాను దంపతులపై దాడి చేయబోగా వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన్ను పోలీసులు స్టేషన్‌కు పలిపించి మందలించి పంపించారు. దీంతో ఇంకా కోపం

2లో

నాలో నీవే నాటికలో సన్నివేశం



2 లో

సందేశాత్మక ఇతివృత్తం.. అద్భుత అభినయం..

మూడో రోజుకు వైయస్సార్ నాటక కళాపరిషత్ నాటకోత్సవాలు

కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

33వ అంతర్ జిల్లాల బాలబాలికల కబడ్డీ పోటీలు స్థానిక వృందా మహిళా జూనియర్ కాలేజీ మైదానంలో బుధవారం ప్రారంభమయ్యాయి. పోటీలు శుక్రవారం వరకూ కొనసాగనున్నాయి. ప్రారంభం సభకు కాలేజీ డైరెక్టర్ అనూష అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, వైసిపి నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ఆడటమే నిజమైన విజయమని అన్నారు. గెలుపోటములను సహజమనే



తలపడుతున్న గుంటూరు-అనంతపురం బాలికలు జట్లు

విషయాన్ని గుర్తించాలని, ఓటమిని విజయానికి పునాది చేసుకోవాలని చెప్పారు. పోటీల్లో స్నేహ భావంతో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. పాఠశాలల్లో తగినంతగా క్రీడా ప్రాంగణాలు లేని కారణంగా క్రీడలు నానాటికీ కనుమరుగవుతున్నాయని

2లో

సమాజ పురోగతిలో దళిత సాహిత్యానికి ప్రత్యేక స్థానం

ఎఎన్‌యు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ స్వరూప రాణి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

సమాజ పురోగతిలో ప్రత్యేక స్థానమున్న దళిత సాహిత్యం మరింత విస్తృతం కావాల్సిన అవసరం ఉందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. వర్సిటీలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో 'అంబేద్కర్ ఆలోచన విధానం - ఆర్థికాభివృద్ధి - దేశ నిర్మాణం' అంశంపై రెండ్రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ త్రిమూర్తిరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో స్వరూపరాణి మాట్లాడుతూ సాహిత్యంతోనే సంస్కృతీ సంప్రదయాలు ఉంటాయని, సాహిత్యంపై యువత మక్కువ పెంచుకోవాలని సూచించారు. అంబేద్కర్ ఆలోచన విధానంలో దేశ నిర్మాణం ఎలా సాధ్యమవుతుందో సిడిసి డీన్ ప్రొఫెసర్ కె.మధుబాబు, హైదరాబాదులోని మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జివి రత్నాకర్, జెఎన్టియు కాకినాడకు చెందిన డాక్టర్ అబ్బయ్య, యుఎస్ఎ నుంచి వచ్చిన కృష్ణమోహన్, దళిత నాయకులు మేళం భాగ్యరాజు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సమాజం పట్ల ప్రతిఒక్కరూ చైతన్యవంతం కావాలని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి సెమినార్ డైరెక్టర్, అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ వై.అశోక్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్రహం లింకన్, దూరవిద్య పరీక్షల కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.సోమశేఖర్ ఆధ్వర్యంలో ధ్రువపత్రాలను ప్రదానం చేశారు.



ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే డయేరియా

మాజీ మంత్రులు లక్ష్మీనారాయణ, ఆనంద్‌బాబు

- బాధిత కుటుంబాలకు సాయం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరులో డయేరియా మరణాల బాధిత కుటుంబాలను మాజీ మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనంద్‌బాబు బుధవారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. నక్కా ఆనందబాబు

2లో

నేటితో స్థలాల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పేదలందరికీ ఇళ్ళ పథకం స్థలాల రిజిస్ట్రేషన్లలో అలసత్వం వహించే సచివాలయ ఉద్యోగులు, పర్యవేక్షించే నోడల్ అధికార్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. ఇళ్ల పథకం స్థలాల రిజిస్ట్రేషన్, జగనన్న పాలవెల్లువ, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, గృహ నిర్మాణం తదితర అంశాలపై ప్రత్యేకాధికారులు, మున్సిపల్

2లో



25న జాతికి అంకితం కానున్న ఎయిమ్స్

ప్రజాశక్తి - మంగళగిరి : స్థానిక ఎయిమ్స్ ఆస్పత్రిని ఈనెల 25న జాతికి అంకితమిచ్చే కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పాల్గొంటున్నందున ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. ఏర్పాట్లను రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, జిల్లా ఎస్పీ తుషార్ దూడీతో కలసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఎయిమ్స్‌ను వర్చువల్ విధానంలో ప్రధాని మోడీ జాతికి అంకితం చేస్తారని కలెక్టర్ చెప్పారు. పరిశీనలో డిఆర్‌డిఎ పీడీ హరిహరనాథ్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మీ పాల్గొన్నారు.



పదో తరగతి మోడల్ ప్రశ్నాపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పదవ తరగతి మోడల్ ప్రశ్నపతాలను పట్టణంలోని 200 మంది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పట్టణంలోని శ్రీలక్ష్మీ ఫైనాన్స్ ఆర్థిక సాయంతో బుధవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా మన్యం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ధనలక్ష్మి హాజరయ్యారు. శ్రీ లక్ష్మీ ఫైనాన్స్ డైరెక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ కష్టపడి చదువుకున్న వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని, భవిష్యత్తులో విద్యార్థులకు ఏమైనా అవసరాలుంటే తాము సహకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ సారథి, నాయకులు శ్రీనివాసరావు, హనుమంతరావు, సాయిబాబు పాల్గొన్నారు.

నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో రక్షిత నీటి సరఫరాకు సంబంధించిన ప్రధాన పైప్లైన్ మరమ్మతు కారణంగా గురువారం సాయంత్రం నుంచి పట్టణంలో తాగునీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న బుధవారం తెలిపారు. తెనాలి విజయ వాడ రోడ్డులో ఉన్న ప్రధాన పైప్‌లైన్ మంగళవారం పగిలి పోయిన సంగతి తెలిసిందే. మంగళవారం రాత్రి కమిషనర్ పరిశీలించి నీటి వృథాను అరికట్టారు. ఉండవల్లి సమీపంలో ఉన్న వాల్ మూసి వేయించారు. అయితే పూర్తి స్థాయి మం మ్మతులు మాత్రం గురువారం జరుగుతాయని తెలిపారు

'లీజు పేరిట వైసీపీ నాయకులు ఆక్రమించే యత్నం'

ప్రజాశక్తి - నరసరావుపేట



నరసరావుపేట పట్టణం లో ఆర్టీసీకి చెందిన ఎకరం స్థలాన్ని లీజు పేరుతో వైసీపీ నాయకులు ఆక్రమించుకు న్నారని నరసరావుపేట టిడిపి ఇన్‌ఛార్జ్ చదలవాడ అరవింద బాబు ఆరోపించారు. వైసీపీ నాయకుల ఆక్ర మణల పై నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద బాబు మీడియాతో మాట్లాడుతూ ఎకరం విస్తీర్ణంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని లీజు పేరుతో వైసీపీ నాయకులు ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సర్వీసు బస్సులు నిలిపే స్థలాన్ని వైసీపీ నేతలకు ఎలా లీజికిస్తారని ప్రశ్నించారు.లీజు పేరుతో వైసీపీ నేతలు ఆక్రమించుకోవాలనే కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతుంటే కలెక్టర్, ఆర్డీవో,ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసు కోవ డం లేదని అన్నారు.ప్రజా అవసరాల దృష్ట్యా వెంటనే లీజు లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు పి.రామిరెడ్డి, కె.తాండవ కృష్ణ, కె.కోటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం



ప్రజాశక్తి - విజయపురిసౌత్: మంగళ వారం రాత్రి సమ యంలో మాచర్ల నుండి నాగార్జునసాగర్ వైపు వెళ్లే రోడ్డుపై మాచర్ల పట్టణ శివారు ఆర్టీసీ గ్యారేజ్ కి దగ్గర నిర్మా ణంలో ఉన్న బ్రాహ్మణ కళ్యాణ మండపం వద్ద గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా కొత్తపల్లి జంక్షన్ వైపు నుండి మాచర్ల టౌన్ లోకి వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడి చికిత్స నిమిత్తం మాచర్ల ప్రభుత్వ ఆసు పత్రిలో చేరి, మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ప్రభుత్వ ఆసు పత్రికి వెళ్లాడు. ఆ తర్వాత గుంటూరు గవర్నమెంట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పట్టణ సిఐ శరత్ బాబు తెలిపారు. చనిపోయిన వ్యక్తి సమాచారం ఎవరి కైనా తెలిసి ఉంటే మాచర్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో గాని 9440 796240 నంబర్ కు గాని తెలియజేయాలని సిఐ కోరారు.

సందేశాత్మక ఇతివృత్తం.. అద్భుత అభినయం..

మూడో రోజుకు వైయస్సార్ నాటక కళాపరిషత్ నాటకోత్సవాలు

ప్రజాశక్తి - తెనాలి



సేవా రంగ ప్రముఖులను సత్కరిస్తున్న నిర్వాహక బృందం

వైఎస్సార్ నాటక కళాపరిషత్ జాతీయస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు బుధవారం మూడో రోజుకు చేరాయి. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం, ప్రఖ్యా చిల్డ్రన్ ఆర్ట్ థియేటర్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న పోటీల్లో తొలి ప్రదర్శనగా కరణం సురేష్ మెమోరియల్ థియేటర్ వారి 'నాలో నీవే' నాటికకు బొమ్మిడి రామకృష్ణ రచనా దర్శకత్వ బాధ్యతలు వహించారు. ఆద్యంతం సందేశాత్మకంగా నిలిచిన నాటకాలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. అభినయం, ఆహార్యం ప్రేక్షకుల మన్ననలను అందుకున్నాయి. ఈ సందర్భంగా ప్రముఖ హార్మోనిస్ట్ దీపాల సుబ్రహ్మణ్యం, అమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు ఏల్చూరి నాగలక్ష్మిని సత్కరించారు. నాటిక ప్రదర్శనలను ఆరాధ్యుల కన్నా, జి.సుబ్బారావు, గోపరాజు విజయ్, లక్కరాజు లక్ష్మణ్‌రావు, కొండపి శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.మల్లేశ్వరరావు, ప్రముఖ న్యాయ వాది ఎస్.శంకర్, వై.హనుమంతరావు పర్యవేక్షించారు.



జిజిహెచ్‌లో మరో 100 సిసి కెమెరాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో రోగుల భద్రతా కోసం పటిష్టమైన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. రూ.80 లక్షలతో వంద సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు బుధవారం తెలిపారు. ఎక్స్ ఐ సెక్యూరిటీ సంస్థ ద్వారా వీటిని పెడుతున్నామన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 180 సిసి కెమెరాలు పని చేస్తున్నాయని, ఆసుపత్రిలో ఎలాంటి కార్యక్రమాలు జరిగిన వెంటనే సమాచారం అందించేందుకు సూపరింటెండెంట్ ఛాంబర్‌లో 55 అంగుళాల టీవీని ఏర్పాటు చేశామని చెప్పారు.

వేగంగా అంతరించిపోతున్న భాషలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

శ్రీనాథ సాహితీ పరిషత్తు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాలు స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నరసరావుపేటలో బుధవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రమీల అధ్యక్షత వహించారు. శ్రీనాథ సాహితీ పరిషత్తు కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ భాషల్లో చాలా భాషలు మృత స్థితికి చేరాయని, మరో 40 ఏళ్లలో 45 శాతం భాషలు ఉండవని చెప్పారు. ఇది చాలా ఆందోళన కలిగించే విషయమన్నారు. తెలుగు భాష భారతదేశంలో 2వ స్థానం నుండి 3వ స్థానానికి పడిపోయిందని, తెలుగు భాషలో లిపి చాలామంది విద్యార్థులకు రావటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్ర విద్యార్థులకు తెలుగు భాష చదవటం, రాయటం, మాట్లాడటం తప్పనిసరిగా మౌలికమైన విషయాలలో అవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా తెలుగు భాష సాంస్కృతిక వైతాళికులైన గురజాడ అప్పారావు, గుర్రం జాషువా, గిడుగు రామ్మూర్తి, సిపి బ్రౌన్ చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. మాతృభాష ప్రాధాన్యతపై పాఠశాల విద్యార్థులు వక్తృత్వ పోటీలు నిర్వహించడంతోపాటు తెలుగు గేయాలను ఆలపించారు. తెలుగు వ్యాకరణం, ఛందస్సు, అలంకారాలు, ప్రక్రియలపై ఒక పాటను తయారుచేసి గాన యుక్తంగా పాడుతూ నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పద్య కవి ఈవూరి వెంకటరెడ్డి, పద్యాలాపన చేసి విద్యార్థులను ఆకట్టుకున్నారు. వేమన మహేష్ వేమన పద్యాలను ఆలపించారు. పాఠశాల గ్రంథాలయానికి సహకరిస్తామని జన విజ్ఞానవేదిక చలమారెడ్డి, బత్తుల మురళి ఈ సందర్భంగా ప్రకటించారు.



ప్రశంశా పత్రాలు పొందిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

సవాళ్లను అధిగమించి రాణించిన వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. తొలుత పట్టణంలో క్రీడాకారులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్రీడాకారుల నుండి వందనం స్వీకరించారు. క్రీడా జ్యోతిని వెలిగించారు. మొదటి మ్యాచ్‌గా బాలికల విభాగంలో గుంటూరు-అనంతపురం జట్లు, బాలుర విభాగంలో కృష్ణా-గుంటూరు జట్లు తలపడగా అతిథులు క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఏసురత్నం, కబడ్డీ అసోసి యేషన్ రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీకాంత్, గుంటూరు యార్డు చైర్మన్ ఎన్.రాజానారాయణ, నాగుల్‌మీరాన్, శివప్రసాద్, సహారా మౌలాలి, కట్టా సాంబయ్య పాల్గొన్నారు.

అభ్యర్థుల్లో ఆర్థికమే కీలకం

(మొదటి పేజీ తరువాయి)

ఈసారికి అవకాశం ఇవ్వలేకపోతున్నాం. భవిష్యత్తులో అయినా మంచి హోదా కల్పిస్తాం అని ఒకరిద్దరు ఇన్‌ఛార్జిలకు తప్ప పార్టీ కోసం పనిచేసిన నేతలకు ఏమాత్రం భరోసా దక్కడం లేదు. వైసిపిలో జంబ్లింగ్ విధానం పాటిస్తుండగా టిడిపిలో కొత్త వారికి ఛాన్సు ఇచ్చి ఎక్కువ మంది పాత వారిని పక్కన పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఆర్థిక అంశం కీలకం కావడంతో టిడిపి,వైసిపిలకు ఎంపి అభ్యర్థుల కోసం కొత్తవారిని వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. పార్టీలో చేరకుండానే టిక్కెట్లు కేటాయిస్తున్నారు. ముందుగానే ఫలానా స్థానం నుంచిపోటీ చేయడానికి ఒప్పందం చేసుకుని కార్పొరేట్‌రంగానికి చెందిన వారు పార్టీలోకి వస్తున్నారు. పార్టీకి వారు చేసిన సేవలు ఏమీ లేకపోయినా కేవలం డబ్బు ప్రమాణికంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతోంది. నిత్యం ప్రజల్లో ఉండి, ప్రజా సమస్యలపైపోరాడి, ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొని పోలీసు కేసులతో ఇబ్బంది పడుతున్న నేతలకు కూడా గుర్తింపులేకుండా పోయింది. ఆయాపార్టీల అధినాయకులు కోరుతున్నంత పెట్టుబడి పెట్టలేనివారు స్వచ్ఛందంగా పోటీ నుంచితప్పు కుంటున్నారు. మరికొంత మంది పార్లమెంటుకు మా వల్ల కాదు..అసెంబ్లీకి వెళ్తామని సర్దుకుంటున్నారు.

ఆస్తి కోసం కత్తి దూసిన దత్తపుత్రుడు

(మొదటి పేజీ తరువాయి)

పెంచుకున్న అంబేద్కర్ బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటి పక్కన ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేస్తున్న యోహానుపై కొబ్బరి బోండాల కత్తితో దాడి చేయగా యోహాను అక్కడిక్కడే మృతి చెందాడు. వెంటనే ఇంట్లో ఉన్న తల్లి చిట్టెమ్మపైనా దాడి చేయగా ఆమె పెనుగులాడి అరుకుకుంటూ బయటకు పరుగులు తీసింది. దీంతో అక్కడున్న వారు ఆమెను కాపాడి అంబేద్కర్‌ను వారించారు. ఈ సందర్భంలోనూ అక్కడి వారిని అంబేద్కర్ కత్తి చూపి బెదిరించి తల్లిపై మరోసారి దాడి దాడి చేస్తుండగా స్థానిక యువత రాళ్లతో అంబేద్కర్‌పై దాడి చేశారు. దీంతో ఆయన చిట్టెమ్మను వదిలేసి పరారవుతుండగా యువకులు వెంబడించారు. కొద్ది దూరంలో ఉన్న ఓ ఇంటిపైన గదిలోకి అంబేద్కర్ వెళ్లగా యువకులు ఆ గది తలపులు మూసి పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సిఐ ఆంజనేయులు హుటాహుటిన అక్కడికి చేరుకుని క్షతగారతురాలు చిట్టెమ్మను స్థానిక వైద్యశాలకు తరలించారు. యోహాను మృతదేహాన్ని డీఎస్పీ పల్లపు రాజు పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు అంబేద్కర్‌పై గతంలో పలు నేరాలకు సంబంధించి 46 కేసులున్నట్లు సిఐ తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే డయేరియా

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ గుంటూరు నగరంలో కలుషిత మీరు సరఫరా కావడంతో పలువురు అనారోగ్యానికి గురయ్యారని, ఐదుగురు మరణించినా ప్రభుత్వ యంత్రాంగం స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. తప్పును కప్పిపుచ్చుకోవడానికి మంత్రి రజిని, స్థానిక ఎమ్మెల్యే అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇప్పటికి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వందలాది మంది చికిత్స పొందుతున్నారని చెప్పారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోకపోతే ప్రజా ఉద్యమానికి పిలుపునిస్తామన్నారు. తూర్పు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి నశీర్ అహ్మద్ మాట్లాడుతూ నగరంలోని తిరుమల చారి కాలనీ చెందిన ఓబులు, రైలుపేటకు చెందిన షేక్ ఇక్బాల్, శ్రీనగర్‌కు చెందిన, గాజుల సూర్యనారాయణ, మాలంపాటి శంకర్, మద్దెల పద్మ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, నాయకులు చిట్టిబాబు, మద్దిరాల మ్యాని, జాగర్లమూడి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ముప్పవరపు భారతి. పోతురాజు సమత, యల్లావుల అశోక్, బ్రహ్మాసాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటితో స్థలాల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, సచివాలయ ఉద్యోగులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ బుధవారం సమీక్షించారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల పెండింగ్ అధికంగా ఉందని, వార్డు అడ్మిన్లు, వార్డు రెవెన్యూ సెక్రటరీల ద్వారా రిజిస్ట్రేషన్లు వేగవంతం చేసేలా సచివాలయ నోడల్ అధికారులు, తహశీల్దార్లు, డిప్యూటీ కమిషనర్లు, మున్సిపల్ కమిషనర్లు నిత్యం పర్యవేక్షించాలని చెప్పారు. ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న స్థలాల హద్దుల మ్యాపింగ్, సవరణలు వెంటనే పూర్తి చేసి రిజిస్ట్రేషన్లు జరిగేలా మున్సిపల్ ప్లానింగ్ అధికారులు, తహశీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం నాటికి కచ్చితంగా పూర్తి చేయాలన్నారు. సమీక్షలో జేసీ రాజకుమారి, డిఆర్ఒ పి.రోజా పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ నగదు కోసం నిరసన



ప్రజాశక్తి - వినుకొండ: న్యాయం చెయి అంబేద్కర్ అంటూ బాధితురాలు శ్రీరామ్ శాంతి బుధవారం సాయంత్రం వ ట్ట ణం లో ని నరసరావుపేట రోడ్డు పంచాయతీ రాజ్ కార్యాలయం వద్ద గల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. తన భర్త జరినపూడి మహేష్ బాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా నాడు చంద్రన్న బీమా ఇన్సూరెన్స్ నగదు తనకు చెందనివ్వకుండా తన మామ రాజశేఖర్ సొంతం చేసుకున్నాడని, నాటినుండి నేటి వరకు అధికారులు చుట్టూ తిరిగిన తనకు న్యాయం జరగలేదని చెప్పారు. అందుకే, అంబేద్కర్ విగ్రహం వద్ద న్యాయ పోరాటానికి పూనుకున్నట్లు శాంతి పేర్కొంది. తన మామ రాజశేఖర్ డి ఆర్ డి ఏ శాఖలో పనిచేస్తూ తన భర్త ఇన్సూరెన్స్ నగదును తనకు రానివ్వ కుండా నామినిగా అతని పేరు పెట్టుకుని అన్యాయం చేశాడని ఆరో పించింది.

జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయగా ఇన్సూరెన్స్ నగదు భార్యకు చెందాలని ఆ నగదును రాజశేఖర్ నుండి ఇప్పించాల్సిందిగా ఆదేశించినా న్యాయం జరగలేదని పేర్కొంది. శాంతి చేస్తున్న నిరసన సమాచారం మేరకు పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జీవీ ఆంజనేయులు, జనసేన నాయకులు శ్రీనివాసరావు అక్కడికి చేరుకొని సంఘీభావం తెలిపారు.ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

గోవా మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-తాడికొండ: గోవా మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని బుధవారం అదుపులోకి తీసుకున్నారు. తాడికొండ అడ్డరోడ్డు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా బోయపాలెంకు చెందిన కొడాలి సురేష్ బాబు కారులో 46 మద్యం సీసాలు ఉన్నాయి .మద్యం స్వాధీ నం చేసుకుని, సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 1,39,400
మిర్చి ఎగుమతి	: 1,35,644
మిర్చి నిల్వ	: 1,09,411

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 - 20,700
నెం.5	13,000 - 19,000
273	12,500 - 16,500
341	12,000 - 20,000
4884	13,700 - 17,500
సూపర్ 10	16,200 - 19,000
	నాన్ ఎసి
తేజ	8,000 - 21,000
బడిగి	9,500 - 20,000
దేవనూరు డీలక్స్	12,000 - 20,000
తాలుకాయలు	5,000 - 12,000

విలేకరులపై దాడులు హేయం



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా: ప్రస్తుతం రాష్ట్రంలో విలేకరులపై పత్రిక కార్యాలయాలపై జరుగుతున్న దాడులను చూస్తుంటే భవిష్యత్తులో విలేకరి వృత్తి లోకి రావాలంటే కుంగ్‌ఫూ, కరాటే వచ్చిన వారు ఉండాల్సిన పరిస్థితి దాపురిస్తుందా అనే అనుమానం కలుగుతోందని ఏపీడబ్ల్యూజే పల్నాడు జిల్లా గౌరవ అధక్షులు నంద్యాల జగన్మోహన్ రెడ్డి అన్నారు. కర్నూలులో ఈనాడు ప్రాంతీయ కార్యాలయం పై దాడిని ఖండించారు. ఏపీ డబ్ల్యూజే పల్నాడు జిల్లా కమిటీ , నరసరావుపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మానవ హారంగా ఏర్పడి, దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయంలో కార్యనిర్వహణ అధికారికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. **ప్రజాశక్తి-తెనాలిరూరల్:** అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడుతూ ప్రశ్నించిన మీడియా ప్రతినిధులపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక మారిసుపేటలోని పెండ్యాల కళ్యాణ మండపంలో బుధవారం గౌడ సంఘీయలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. **ప్రజాశక్తి-బెల్లంకొండ:** వచ్చే ఎన్నికలలో ఓటమి జగ న్మోహన్ రెడ్డిని కలవర పెడుతోందని, ఆ భయంతోనే ఏమి చేయలేక చేతగానితనంతో పత్రికల మీద విలేకరుల మీద దాడులకు పురిగొలుప్తున్నారని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ధ్వజమెత్తారు. కర్నూల్ లోని ఈనాడు కార్యాలయం పై ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అనుచరులు దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

బిసి ఆత్మీయ సదస్సు

ప్రజాశక్తి-పెదకూరపాడు

ఈ నెల 22వ తేదీన క్రోసూరులో బీసీ ఆత్మీయ సదస్సు జరగనున్నట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. ఈ నేపథ్యంలో బుధవారం పెదకూరపాడులో నాయకులు, కార్య కర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. పీసపాడు నుంచి క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీ జరుగుతుందని, భారీ సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఓపీఎస్ అమలు అంశాన్ని మేనిఫెస్టోలో చేర్చండి

ప్రజాశక్తి - వినుకొండ

ఓపీఎస్ పునరుద్ధరణ అంశాన్ని టిడిపి తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులను ఆయన నివాసంలో బుధవారం కలిసి విన్నవించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1.86 లక్షల మంది సిపిఎస్ ఉద్యోగులున్నారని, వారందరికీ పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరారు. ఓపీఎస్‌ను అమలు చేసేవారికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13 లక్షల మందికి పైగా ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు మద్దతిస్తారని చెప్పారు. 'ఓట్ ఫర్ ఓపీఎస్' నినాదంతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల ప్రధాన నాయకత్వానికి వినతి పత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎం.రవిబాబు, ఆర్.అజయ్ కుమార్, పి.ఎ.జిలాని, ఎం.పోలయ్య, పి.రమేష్‌బాబు, ఎ.నాగేశ్వరరావు, బి.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.





డయల్ యువర్ కలెక్టర్‌కు 11 ఫిర్యాదులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక ఎన్నికల దష్ట్యా చేపట్టిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తున్నట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ చెప్పారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో సుదూర ప్రాంతాల నుంచి ఓటర్లుగా నమోదు, తొలగింపు, బదిలీలకు సంబంధించి 11 మంది సంప్రదించి సమస్యలను విన్నవించారని చెప్పారు. వాటిని త్వరగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ అజయ్ కుమార్ పాల్గొన్నారు.



అవార్డులు అందుకుంటున్న గీతమ్స్ గ్లోబల్‌మైండ్స్ విద్యార్థులు

ఒలిపియాడ్‌లో గీతమ్స్ గ్లోబల్ మైండ్స్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు

ప్రజాశక్తి - వినుకొండ

శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన శ్రీనివాస రామానుజన్ మాథ్స్ ఒలింపియాడ్‌లో స్థానిక గీతమ్స్ గ్లోబల్ మైండ్స్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు హెచ్‌ఎం ఎన్. సూర్యనారాయణ బుధవారం తెలిపారు. హైదరాబాదు రవీంద్ర భారతిలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో తమ పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థి అభిరామ్ రాష్ట్రస్థాయి 2వ ర్యాంక్, 8వ తరగతి విద్యార్థులు షేక్ మొహమ్మద్ సాబిత్, రాష్ట్రస్థాయి 3వ ర్యాంక్, లిఖిత్ రాష్ట్రస్థాయి 4వ ర్యాంక్ అవార్డులను లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ నుండి అందుకున్నారన్నారు. వీరిని హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కెజి బేసిన్ ఆదాయంలో 50 శాతం ఏపీకివ్వాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట



కృష్ణా - గోదావరి బేసిన్లో లభ్యమయ్యే గ్యాస్, ముడి చమురు నిక్షేపాల ద్వారా లభించే ఆదాయంలో 50 శాతం వాటా రాష్ట్రానికి ఇవ్వాలని, తద్వారా రూ.వందకే గ్యాస్ సిలిండర్ 25 పైసలకే యూనిట్ విద్యుత్ అందించే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రాధాకృష్ణ అన్నారు. ఈ మేరకు ఏపీ కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ ఎంఎం పల్లంరాజుకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. దీనిపై స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనాలోచితంగా ప్రవేశపెట్టిన స్టాంపుల రహిత రిజిస్ట్రేషన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పద్ధతినే కొనసాగించాలని కోరారు. ఇతర ప్రాంతాల నుండి మన రాష్ట్రానికి వచ్చి జీవిస్తున్న వారికి కుల ధ్రువీకరణ పత్రాల జారీకి ఒక చట్టాన్ని తేవాలన్నారు. ఈ అంశాలన్నింటినీ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చాలని తాను పల్లంరాజుకు వివరించారనని చెప్పారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

అనుమతుల్లేకుండానే ప్రహరీ నిర్మించారని టిడిపి, జనసేన ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - వినుకొండ



స్టేడియం పేరుతో గంగినేని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణంతో జరిగిన నిధులు దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకొని అవినీతి సొమ్మును రికవరీ చేయాలని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు టిడిపి-జనసేన ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. జీవీ ఆంజనేయులు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కె.నాగ శ్రీను రాయల్ మాట్లాడుతూ స్టేడియానికి స్థలం కేటాయింపు, ఉన్నత విద్యాశాఖ అనుమతి లేకుండా రూ.1.80 కోట్లతో ప్రహరీ కట్టి దాన్ని స్టేడియం అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేరు పెట్టుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. అత్యవసర సమయాల్లో ఉపయోగించాల్సిన జిల్లా మినరల్ ఫండ్ (డిఎంఎఫ్) రూ.కోటిని దుర్వినియోగం చేశారన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి వినకొండకు వచ్చిన సమయంలో వైయస్సార్ స్టేడియంగా బ్యానర్ కట్టి సిఎం ఊరు దాటగానే పేరు మార్చుకున్నారని అన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం సమయంలో వచ్చిన మట్టిని స్టేడియంలో నింపి ఎమ్మెల్యే రూ.లక్షలు దోచుకున్నారని ఆరోపించారు. స్టేడియంలో పిచ్చి చెట్లు తప్ప క్రీడాకోర్టులు లేవన్నారు. రానున్న టిడిపి - జనసేన ప్రభుత్వంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అభివృద్ధి చేసి, ఎన్ఎస్పీ స్థలంలో స్టేడియంను నిర్మిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు షమీంఖాన్, సురేష్‌బాబు, పూర్ణచంద్రరావు, కోటేశ్వరరావు, అభిమన్యు, అనిల్‌కుమార్, మణికంఠ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తెలుగు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డిపై హత్యాయత్నాన్ని, ఈనాడు కార్యాలయంపై దాడిని జీవీ ఆంజనేయులు విలేకర్ల సమావేశంలో ఖండించారు. వినుకొండలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు రౌడీఇజాన్ని ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటూ టిడిపి బ్యానర్లు చించి వేయించారని, టిడిపి హయాంలో అభివృద్ధి పనుల శిలాఫలకాలనూ ధ్వంసం చేయించి అల్లర్లను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. బ్యానర్లు చించి. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి నిర్మించకుండానే 100 పడకల ఆసుపత్రి నిర్మించామని ఎమ్మెల్యే ఊదరగొట్టడం హాస్యాస్పదమన్నారు. వరికపూడిశెల నిర్మాణ యోచన వైసిపికి లేదని, టిడిపితోనే సాధ్యమని అన్నారు.



స్పందించకుంటే మంత్రి ఇంటి వద్దే ధర్నా

ప్రజాశక్తి - చిలకలూరిపేట: జాతీయ రహదారి నుండి పసుమర్రు వైపు వెళ్లే రోడ్డుకు అడ్డంగా మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ విడదల లక్ష్మీనారాయణ కట్టించిన గోడను తొలగించాలని పసుమరు గ్రామస్తులు, అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గోడవద్ద జాతీయ రహదారిపై బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి నుండి చీరాల వైపు వెళ్లే రహదారిలో గోడ కట్టడం వల్ల ప్రజలు, ఇతర వాహనాలు రాకపోకలకు, భూములున్న రైతులు, ఇళ్ల స్థలాలు కొన్న వారు, ఇంటి నిర్మాణదారులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. 15వ వార్డు వైసిపి కౌన్సిలర్ జాలాది సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అయిన విడదల రజిని కుటుంబానికి పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి గోడను తొలగించి దారివ్వకుంటే మంత్రి ఇంటిముందు, తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. ధర్నాలో వైసిపి కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, జాలాది సుబ్బారావు, గొంటు శ్రీనివాసరెడ్డి, గడిపూడి దశరథ రామయ్య, నాయుడు వాసు, మల్లెల శివనాగేస్వరరావు, కోటా కిషోర్, జనసేన నాయకులు రాజా రమేష్, టిడిపి నాయకులు మనోహర్, స్థానికులు పాల్గొన్నారు.

నవోదయం కింద కారు అందజేత

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా: నవోదయం కార్యక్రమం ద్వారా లబ్ధి పొంది వాహనాలు తీసుకున్న వారు రుణాలను సకాలంలో చెల్లించాలని, తద్వారా రాయితీలు పొంది ఆర్థికాభ్యున్నతి సాధించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని కలెక్టరేట్ ప్రాంగణంలో లబ్ధిదారుడైన గురజాలకు కర్రా చైతన్యకు జగనన్న బడుగు వికాసం కింద మంజూరైన రూ.16.16 కియా కారుకు బుధవారం అందించారు. ఇందులో లబ్ధిదారుని వాటా 10 శాతం కాగా 90 శాతం బ్యాంక్ రుణం పొందగా మొత్తం 45 శాతం రాయితీ లభించనున్నట్లు తెలిపారు. నవోదయం నోడల్ ఆఫీసర్ కె.సంజీవరావు, ఇన్‌ఛార్జి డిఆర్ఒ అజయ్ కుమార్, డ్వామా పీడీ జోసఫ్ కుమార్ పాల్గొన్నారు.



కందులు క్వింటాళ్ రూ.9600కు కొనుగోలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎడిఎ రవిబాబు

ప్రజాశక్తి-ఈపూరు

క్వింటాళ్ కందులను రూ.9,600కు రైతుల వద్ద నుండి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వినుకొండ ఎడిఎ రవిబాబు అన్నారు. మండలంలోని కొండ్రముట్ల, కొండ్రముట్లపాలెం గ్రామాల్లో కంది రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రవిబాబు మాట్లాడుతూ మండలంలో 621 మంది రైతులు 1322 ఎకరాల కంది సాగు చేశారని, పంట వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేశామని చెప్పారు. కంది కోతదశకు రావడంతో ప్రభుత్వ మద్దతు ధరకు రైతులు అమ్ముకునేలా వారికి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అమ్మకానికి సిద్ధంగా ఉంచిన కందులను పరిశీలించారు. జీడీసీఎంఎస్ ఆధ్వర్యంలో 37 క్వింటాళ్లను కొనుగోలు చేశామని తెలిపారు. తేమశాతం 12 ఉండాలని, గోతాలు, రవాణా ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు, జీడిసిఎంఎస్ ఉద్యోగి శ్రీనివాసరావు, ఆర్బికే సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పన పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ఫర్నిచర్, లైటింగ్, ర్యాంపులు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలను కల్పించామని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ చెప్పారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమావేశం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో ఎస్.ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నిర్వహించారు. ఓటరు జాబితాల ప్రచురణ అనంతరం నమోదు, తొలగింపులు, సవరణల కోసం అందిన ధరఖాస్తుల పరిష్కారం, ఇవిఎంలు, వివిపాట్‌ల వినియోగంపై ఓటరు అవగాహనా కార్యక్రమాలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు, మోడల్ కోడ్ టీమ్లు, వ్యయ పరిశీలన టీంల ఏర్పాటు, వృద్ధులు, వికలాంగులకు హోమ్ ఓటింగ్ సదుపాయం, క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు తదితర అంశాలపై కలెక్టర్ వివరించారు. ఎన్నికల నిర్వహణకు ఎంసిసి, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వైలెన్స్, అకౌంటింగ్ టీములు, ఎఈఓల నియామకం పూర్తయిందన్నారు. ఎన్నికల ప్రకటన వెలువడిన వెంటనే ఈ బృందాలు పనుల ప్రారంభిస్తాయన్నారు. 80 ఏళ్ల పైబడిన ఓటర్లు, 40 శాతం పైబడిన వైకల్యం కలిగిన ఓటర కోసం హోమ్ ఓటింగ్ వెసులుబాటును ఫారమ్-డి ధరఖాస్తు ద్వారా వినియోగించుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఇన్‌ఛార్జి డిఆర్ఒ అజయ్ కుమార్, కలెక్టరేట్ సి సెక్షన్ హెచ్‌ఒడి టి.రవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి
గుంటూరు 5
గురువారం 22 ఫిబ్రవరి 2024

నేడు అగ్ని ప్రమాద బాధిత పసుపు రైతుల ధర్నా

జయప్రదం చేయాలని పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకర్ పిలుపు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

జనవరి 19వ తేదీన, దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ లో అగ్ని ప్రమాదం సంభవించి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ గురువారం ఉదయం 10 గంటలకు, దుగ్గిరాల కోల్డ్ స్టోరేజ్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని బుధవారం గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద ఉన్న, కేబి భవన్ లో పసుపు రైతుల సంఘం నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు మాట్లాడుతూ దుగ్గిరాల కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదానికి గురై పసుపు పంట పూర్తిగా దగ్ధం అయిన పరిస్థితుల్లో రైతు సంఘాల ఆందోళన చేపట్టిందని అన్నారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదం దర్యాప్తును నిమిత్తం జిల్లా సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో జనవరి 30న కోల్డ్ స్టోరేజ్ ను పరిశీలించి, వారం రోజులలో విచారణ జరిపి వివరాలను రైతులకు అందజేస్తామన్నారని అన్నారు. ప్రమాదం జరిగి 33 రోజులు గడిచిన ప్రభుత్వం నుండి రైతాంగానికి ఎటువంటి సమాచారం అందలేదని ఆయన అన్నారు. దీంతో రైతు సంఘం పూర్తిగా ఆందోళనలో ఉన్నారని తక్షణమే పసుపు దగ్ధమైన రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రస్తుతం క్వింటా పసుపు మార్కెట్ ధర 11,800 పలుకుతుందని అన్నారు. ఆ ధర ప్రకారం పసుపు యార్డులో నిల్వ ఉంచిన, ప్రతి రైతుకి, ప్రతి క్వింటాకి 11,800 చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కోల్డ్ స్టోరేజ్ బాధితుల కన్వీనర్ కాజా వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సూర్యనారాయణ, తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, భీమవరపు కోటిరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

ప్రజాశక్తి-తెనాలిరూరల్ :ఇటీవల దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజిలో సంభవించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతుల ధర్నా గురువారం ఉదయం పది గంటలకు దుగ్గిరాల కోల్డ్ స్టోరేజ్ వద్ద జరుగుతుందని ఏపి పసుపు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ములకా శివసాంబిరెడ్డి తెలిపారు. ప్రమాదం సంభవించి నెల రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలో చేపట్టిన ధర్నాలో పసుపు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

రాజకీయ పార్టీలతో కలెక్టర్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో అన్నిరకాల ఓటరు దరఖాస్తులను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం క్షేత్రస్థాయిలో సక్రమంగా విచారించి ఈఆర్వోలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డిఆర్ఓ పెద్ది రోజా ఓటర్ల జాబితాపై రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆప్ నాయకులు డాక్టర్ టి. సేవాకుమార్, బిఎస్‌పి నుండి సిహెచ్.వాసు, కాంగ్రెస్ నుండి బిళ్ళా సునీల్ టిడిపి నుండి కె.శివరామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరుకు సంబంధించి అందిన ఫారం 6, 7, 8 దరఖాస్తుల వివరాలను తెలియజేసి, వీటిని నిర్దేశించిన సమయానికి పరిష్కరించి ఎప్పటికప్పుడు అన్లైన్‌లో అప్డేట్ చేయటం జరుగుతుందన్నారు. ఓటరు జాబితాపై, దరఖాస్తుల పరిష్కారంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలిపిన అంశాలు, అభ్యంతరాలను ఈఆర్వోలు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయపార్టీలు, అభ్యర్థుల అవగాహన కోసం ఎన్నికల సంఘం ఈవీఎంలు, వీవీప్యాట్‌లు పనిచేసే విధానం, భద్రత ఫీచర్లపై అవగాహన కోసం రూపొందించి మెటీరియల్‌ను రాజకీయపార్టీల ప్రతినిధులకు అందించటం జరుగుతుందని వీటిని పూర్తి స్థాయిలో పరిశీలించాలన్నారు.సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రవీంద్రరావు, లక్ష్మీకుమారి, జిఎంసి అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

అభివృద్ధి కార్యక్రమాలకు మాజీ మంత్రి సుచరిత శంకుస్థాపన

ప్రజాశక్తి -మేడికొండూరు



మేడికొండూరు మండలం డోకిపర్రు గ్రామపంచాయతీ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శుంకుస్థా పనలు, ప్రారంభోత్సవాలు శంకుసా పనలు ప్రారంభోత్సవాలు తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, ప్రతిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత బుధవారం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్లో జోసిల్ కంపెనీ సౌజన్యంతో సుమారు రూ.26 లక్షల వ్యయంతో నిర్మించి తలపెట్టిన అదనపు గదుల నిర్మాణాలకు జోసిల్ కంపెనీ ఎండి జాగర్లమూడి మురళీమోహన్, ఎమ్మెల్యే సుచరిత శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే సుచరిత మాట్లాడుతూ ప్రజలకు అసలైన అభివృద్ధి అంటే ఏంటో ఈ గ్రామంలో గత కొన్ని సంవత్సరాలనుంచి తెలుస్తుందన్నారు. జోసెల్ కంపెనీ ఎండి మురళీమోహన్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. అనంతరం గ్రామంలో రూ. 20 లక్షల రూపాయలతో నిర్మించినటువంటి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల కింద వేసినటువంటి సైడ్ డ్రైన్లు నిర్మాణ పనులు పూర్తి అవ్వడంతో వాటిని ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పిటిసి కందుల సిద్దయ్య, గ్రామ సర్పంచి కొండే పోగు సామ్రాజ్యం, పంచాయతీ కార్యదర్శి బందెల రమేష్, స్కూల్ కమిటీ చైర్మన్ ఉడతా. ప్రభాకర్ రావు,జోసిల్ యాజమాన్యం, గ్రామ సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

కెఎల్‌యులో ముగిసిన కోనేరు లక్ష్మయ్య స్మారక క్రీడలు

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్



కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఎంత నిర్వహించిన జాతీయ స్థాయి కోనేరు లక్ష్మయ్య స్మారక క్రీడలు 2024 బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముగింపు సభకు వర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ జి పార్థసారథి వర్మ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు విజేతలకు బహుమ తులను ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమేనన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరిక ఆరోగ్యంతో పాటు క్రీడా స్ఫూర్తి భవిష్యత్తులో పలరకాల పోటీలకు సిద్ధపడతానికి ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు. జాతీయస్థాయిలో ఐదు రాష్ట్రాల కు చెందిన క్రీడాకారులకు తమ వర్సిటీ ఆతిథ్యం ఇవ్వటం తమకు ఎంతగానో ఆనందంగా ఉందన్నారు. కబడ్డీ క్రీడాలలో కే ఎల్ యు విద్యార్థులు ప్రథమ స్థానం సాధించగా ఎన్టీఆర్ జిల్లా పరిటాల అమత్సహి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఖో ఖో క్రీడలో ప్రథమ స్థానాన్ని కేఎల్ హెచ్ హైదరాబాద్ క్యాంపస్ విద్యార్థులు సాధించగా ద్వితీయ స్థానాన్ని ఎన్టీఆర్ జిల్లా పరిటాల మిక్కు కళాశాల విద్యార్థులు సాధించారు. పలు రకాల క్రీడల్లో కళాశాలల విద్యార్థులు ప్రథమ ద్వితీయ స్థానాలను సాధించగా వారందరికీ వర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ జి పార్థసారథి వర్మ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కే. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సిహెచ్.హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులు కావాలి : డాక్టర్ పెమ్మసాని

ప్రజాశక్తి - తెనాలి

ఎన్నికల వేళ మాత్రమే కాకుండా అన్ని సందర్భాలలోనూ ప్రజలకు నిత్యం అండగా ఉండే నాయకులే ముఖ్యమని టిడిపి నేత డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీకి డాక్టర్ చంద్రశేఖర్ అభ్యర్థిత్వం ఖరారైన నేపథ్యంలో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నాయకులు పెద్ద ఎత్తున ఆయనను వ్యక్తిగతంగా కలుస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం దుగ్గిరాల, చిలువూరు, పెదవడ్లపూడికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు, మహిళా నాయకులు బుర్రిపాలెంలో డాక్టర్ చంద్రశేఖర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయా మండలాలలో రాజకీయ పరిస్థితులపై ఆయనతో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తున్న నాయకులను గుర్తించాలని వారు ఆయనను కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ సీఎం జగన్ లాగా నేల విడిచి సాము చేసే నాయకులు ప్రజలకు అవసరం లేదని, పేదల కష్టాలను గమనించి వారికి అండగా నిలిచే నాయకులను ప్రజలు కోరుకుంటారన్నారు. పార్లమెంట్ పరిధిలో పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల వివరాలు సేకరించామన్నారు. ఆయా మండలాలలో పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ఒక రైతు కుటుంబం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన తనపై ప్రజలు నమ్మకం ఉంచాలన్నారు. త్వరలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో పర్యటన ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వట్టిచెరుకూరు టీడీపీ నాయకులు స్థానిక ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా పోటీ చేసిన తమపై ఆ పార్టీ నాయకులు దాడులు చేశారని, పోలీసులు సైతం పట్టించుకోలేదని వాపోయారు. ప్రతి ఒక్క కార్యకర్తకు పార్టీ పరంగా అండగా ఉంటామని డాక్టర్ చంద్రశేఖర్ వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ జవ్వాది కిరణ్ చంద్, జిల్లా సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇంఛార్జి మాదల రమేష్ బాబు, మంగళగిరి మండల మహిళ అధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, చిలువూరు పార్టీ ప్రెసిడెంట్ తోటకూర సీతారామయ్య, సర్పంచ్ మాణిక్యమ్మ, ఎంపిటిసి జబియా పాల్గొన్నారు.


డాక్టర్ పెమ్మసానితో భేటీ అయిన పలువురు నాయకులు


ప్రదర్శనను ప్రారంభిస్తున్న సీఈవో శ్రీనివాసరావు

జాతీయ మేలుజాతి దూడల ప్రదర్శన

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలోని పెదపరిమిలో బుధవారం జాతీయ మేలు జాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర లైవ్ స్టాక్ డెవలప్ మెంట్ సీఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. సమర్థవంతమైన లేగ దూడల పెంపకం పాడి పరిశ్రమ అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. పసి దూడల సంరక్షణకు పశుపోషకులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాతీయ మేలు జాతి దూడల ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ జాతి లేగ దూడలను సంరక్షిస్తున్న పశు పోషకులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు ఎ మురళీకృష్ణ, శ్రీపతి రేణుకా దేవి, టి శ్రీనివాస రావు, సి హెచ్ సుమబాల, ఎం మౌనిక, వైసిపి నాయకులు ఎన్ రఘునాథరావు, పి సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

24న సింహాద్రి శివారెడ్డి వర్ధంతి సభ

జయప్రదం చేయాలని నాయకుల పిలుపు

ప్రజాశక్తి మంగళగిరి

జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, నిష్కళంక ప్రజా సేవకులు సింహాద్రి శివారెడ్డి ఏడవ వర్ధంతి సందర్భంగా కరపత్రం బుధవారం రాత్రి మంగళగిరి సీపీఎం కార్యాలయంలో ఆవిష్క రించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో అంటరాని తనానికి, మూఢవిశ్వాసాలకు, కుల వివక్షకు వ్యతిరేకంగా శివారెడ్డి ఉద్యమాలు చేశారన్నారు. కార్యకర్తలను తయారు చేయ డంలో పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు అర్థమయ్యేటట్లు చెప్పడంలో ఆయన దిట్ట అని కొనియాడారు. తుది శ్వాస విడిచే వరకు కూడా కమ్యూనిస్టుగా సమాజ సేవలో గడిపిన వారే ధన్యజీవులు అనే శివారెడ్డి గారు ఆ కోవకు చెందిన వారిని ఆదర్శనీయుడని కొనియాడారు. 24వ తేదీ శనివారం మంగళగిరి సిపిఎం కార్యలయంలో వర్ధంతి సభ నిర్వహిస్తున్నామని సిపిఎం శ్రేణులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి జవహర్‌లాల్, వై కమలాకర్, సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న దండా లక్ష్మీనారాయణ తదితరులు

బొడ్డు కమలయ్య జీవితం నేటి యువతకు ఆదర్శం

ప్రజాశక్తి - పొన్నూరురూరల్ :బొడ్డు కమలయ్య జీవితం నేటి యువతకు ఆదర్శమని సిపిఎం గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు దండా లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం జూపుడిలో బొడ్డు కమలయ్య 20వ వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి, వ్యవసాయ కార్మికుల అభివృద్ధి కి నిరంతరం కృషి వ్యక్తి బొడ్డు కమలయ్య అని అన్నారు. బొడ్డు కమలయ్య తుది శ్వాస వరకు కమ్యూనిస్టుగానే జీవించారన్నారు. కార్యక్రమంలో సిపిఎం పొన్నూరు కార్యదర్శి బొనిగల ప్రభుదాసు, నాయకులు ఎన్ రమేష్ బాబు, సిహెచ్ హనుమంతరావు, కొమురయ్య కుమారుడు సుందర బాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వంద శాతం పల్స్ పోలియో చుక్కలు వేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వచ్చే నెల 3న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐదేళ్ల లోపు చిన్నారులు 1.86 లక్షల మందికి వంద శాతం పల్స్ పోలియో చుక్కలు వేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివ శంకర్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నరసరావు పేలోని కలెక్టరేట్‌లో పల్స్ పోలియో ప్రక్రియకు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ ప్రచు రించిన వాల్‌పోస్టర్లను బుధవారం కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో మార్చి 3 న జరగ నున్న పల్స్ పోలియో పై జిల్లా అధి కారు లతో సమీక్ష సమావేశం వెబెక్స్ ద్వారా నిర్వహించారు. పోలియో కేంద్రా లలో వేయ డంతో పాటు 4, 5 తేదీలలో ఇంటింటికి తిరిగి వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తి చేయా లని ఆదేశించారు. జిల్లాలోని పంచాయతీరాజ్, పోలీస్ శాఖ, ఐసీడీఎస్, విద్యాశాఖ, మున్సిపల్ శాఖ, ఆర్టీసీ ,రైల్వే శాఖ ,పబ్లిక్ రిలేషన్స్ శాఖ అధికారులు సహాయ సహకారాలు అందించాలన్నారు. జిల్లాలో మొత్తం 1135 పోలియో కేంద్రాలు,70 సంచార పోలియో టీం ద్వారా జరిగే పల్స్ పోలియో కార్య క్రమాన్ని విజయ వంతంగా పూర్తి చేయా లని ఆరోగ్య కార్య కర్తలు, అంగన్వాడీ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొనాలని ఆదేశించారు. సమీక్ష సమా వేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, జిల్లా ఇమ్యునైజేషన్ అధి కారి డాక్టర్ బి గీతాంజలి,జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, డిసిహెచ్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్,వైద్య ఆరోగ్య శాఖాధికారులు

రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లాలో పేదల ఇళ్ల పట్టాలకు సం బంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటి వరకు 74.6 శాతం పూర్తి చేశారని, మిగి లిన దానిని త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శివ శంకర్ ఆదేశించారు. బుధవారం ఆయు ష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డులు ,భూ రీ - సర్వే తదితర అంశాలపై సంబంధిత అధి కారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పేదలు అందరికీ ఇళ్ళు కార్యక్రమంలో భాగంగా 87,169 రిజిస్ట్రేషన్ లక్ష్యం కాగా 65, 014 రిజి స్ట్రేషన్లు పూర్తయినట్లు చెప్పారు. రిజి స్ట్రేషన్ ప్రక్రియలో వెనుకబడిన మండ లాలు త్వరితగతిన రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు మొత్తం 9, 90,997 లక్ష్యం కాగా 6,69,210 ఈకేవైసి చేయడం జరిగిం దని మిగిలిన వాటిని త్వరిత గతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదే విధంగా భూముల రీ-సర్వే కార్యక్రమంలో లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

అవార్డులు అందుకున్న వాలంటీర్లు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు వాలంటీర్ల సేవలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని వాలంటీర్లు అందిస్తున్న సేవలతో వైసిపికి రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయని పేద లకు మెరుగైన సేవలను అందించడం ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందు తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం నరసరావుపేట మం డలం లోని గ్రామాలలో పని చేస్తున్న వాలం టీర్లకు వాలంటీర్లకు వందనం మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. అవార్డులు పొందిన వాలంటీర్లకు పురస్కారాలను ఎమ్మెల్యే అందజేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసరావుపేట మండలంలో 532 మంది వాలంటీర్లకు అవార్డులు వరించాయని వారిలో 501 మందికి సేవా మిత్ర, ఐదుగురికి సేవారత్న, ఇరువురుకి సేవా వజ్ర అవార్డులు రావడం జరిగిందన్నారు. గతంలో సేవా మిత్రా, సేవా రత్న, సేవా వజ్రాలకు అవార్డు రూపంలో అందజేసిన పారి తోషికాన్ని కూడా పెంచామని, గౌరవ వేతనంతో సేవ చేసే వ్యక్తులను గౌరవించడం వలన వారు మరింత ఉత్సాహంగా పని చేస్తారన్నారు.అవినీతి,అక్రమాలకు పాల్పడ కుండా కుల ,మత, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్న వైసిపి పాలనకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించిన టిడిపి జన్మభూమి కమిటీలే నాడు టిడిపి ఓటమికి కారణ మయ్యా యని ఎమ్మెల్యే అన్నారు. వైసిపి ఏర్పాటు చేసిన వ్యవస్థలు గ్రామ రూపు రేఖలను మార్చే శాయని, గ్రామస్థాయిలో సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్,రైతు భరోసా కేంద్రాలు రైతులకు అం డగా ఉన్నాయన్నారు. రానున్న ఎన్నికలు జన్మ భూమి కమి టీలకు వాలంటీర్లకు మధ్య జరుగు తున్న యుద్ధవ న్నారు. కార్య క్రమంలో జడ్పిటిసి పి.చిట్టిబాబు, ఎంపిపి ఎం.సుబ్బాయమ్మ, శ్రీని వాసరావు పాల్గొన్నారు.


వాలంటర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి, జడ్పిటిసి పి.చిట్టిబాబు

లారీ స్టాండ్ స్థలానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-వినుకొండ

స్థానిక మార్కాపురం రోడ్డు పసుపులేరు బ్రిడ్జి వద్ద నూతనంగా కేటాయించిన లారీ స్టాండింగ్ స్థలానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. లారీ పార్కింగ్ స్థలం లేక లారీ అసో సియేషన్ సభ్యులు డ్రైవర్లు పడుతున్న ఇబ్బం దులను తాను ప్రత్యక్షంగా గుర్తించడం జరిగిందన్నారు. నాడు అసోసియేషన్‌కు ఇచ్చిన మాట ప్రకారం ఈ స్థలం ఇచ్చామని చెప్పారు. మోటార్ వర్కర్స్ యూనియన్‌కు కూడా ఆటోనగర్ స్థలం కేటా యించామన్నారు. లారీ మోటార్ వర్కర్స్ కార్మికులకు ఎటువంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.


డ్రైవింగ్ సీటులో కూర్చున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు



ఘనంగా మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి-పెదకూరపాడు

మాతృభాషలో కూడా ఉన్నత ఫలితాలు సాధించిన ఘటనలు ఉన్నాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణ అన్నారు. బుధవారం పాఠశాలలో మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. మాతృభాషలో ప్రతిభ ఉన్నవారు ఏ భాషలోనైనా రాణించవచ్చని చెప్పారు. కనుక, విద్యార్థినీవిద్యార్థులు తప్పనిసరిగా తమ మాతృభాషపై పట్టు ఉండాలన్నారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

యడ్లపాడు మండల పరిధిలోని బోయపాలెంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రోటరీ క్లబ్ చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ మేరకు క్లబ్ అధ్యక్షులు కాపు వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు ఎం.వెంకటేశ్వర్లు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పది కుర్చీలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కాపు వెంకటరావు, రొటేరియన్ డాక్టర్ పివి సుబ్బారావు,రోటరీ డైరెక్టర్లు టి.వెంకటనారాయణ, జి.సాంబశివరావు పాల్గొన్నారు.



బాల్యవివాహాలతో అనేక ఇబ్బందులు

ప్రజాశక్తి- నూజెండ్ల

చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేస్తే పిల్లలకు అవ గాహన లోపం, శారీరక ఎదుగుదల లేకపోవడం వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని సిడిపిఓ అనురాధ తెలిపారు. నూజెండ్ల కేజీబీవీ పాఠశాలలో బాల్యవివాహాలపై విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలను చదివించాలని, చిన్నతనంలో వివాహాలు చేయటం నేరంగా పరిగణిస్తారని దీనిపై ప్రతి ఒక్కరు అవ గాహన కలిగి ఉండాలని ప్రదర్శన నిర్వహించారు. పద్దెనిమిదేళ్లు నిండకుండా ఎవ రైనా వివాహాలు జరిపితే తమ దృష్టికి తీసుకురావా లని, లేదా 1098 నంబర్‌లో తెలియజేయవచ్చని చెప్పారు. వివాహం చేసుకోవడం ఇష్టం లేకపోయినా, బలవంతంగా పెళ్లి చేసిన వారి మీద కేసులు కూడా పెట్టవచ్చు న్నారు. పద్దెనిమిదేళ్ల లోపు వివాహాలు జరిగితే జరిగే అనర్థాలపై ఎనిమిదో తరగతి విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విన్యాసమ్మ, నాగరాజుకుమారి, కార్యకర్తలు పద్మ, అనురాధ, వాణి, ప్రసన్న, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నూజెండ్లలో బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన



మీడియా స్వేచ్ఛను కాపాడాలి

ప్రజాశక్తి-రాజుపాలెం

మీడియా స్వేచ్ఛను కాపాడాలని, జర్నలిస్టులపై దాడు లను అరికట్టాలని రాజుపాలెం ప్రెస్‌క్లబ్ సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్డీవో మురళీకృష్ణకు వినతిపత్రం అం దించారు. అంతకముందు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి చానల్ ప్రతి నిధులపై దాడులను ఖండిస్తూ రాజుపాలెం జర్నలిస్టులు బస్ స్టాండ్ సెంటర్ నుండి తహశీల్ధార్ కార్యాలయం వరకు నిర సన ర్యాలీ నిర్వహించారు. జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టా న్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, పి.నాగరాజు, పి.నాగార్జున రెడ్డి, జి.శంకర్రావు, మహేష్, శివ, రాఘవ, ప్రేమ్ దాస్, రాధా కృష్ణ, చంటి, మస్తాన్రావు, పి.వెంకటేశ్వర్లు, సూర్యం, బాబు రావు పాల్గొన్నారు.



పాఠశాలకు మైక్ సెట్ అందజేత

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలో సంతగుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1979- 80 విద్యా సంవత్సరంలో పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాలకు మైక్ సెట్ బహుకరించారు. నరసరావుపేట ఉప విద్యాశాఖాధికారి వేణు గోపాలరావు చేతుల మీదుగా రూ.25 వేలు విలువ చేసే ఈ మైక్ సెట్ ను బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉప విద్యా శాఖాధికారి మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి పాటుపడటం అభినందనీయమని అన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని పాఠశాలలో చదువు చున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతస్థాయికి వెళ్ళితే తమ వంతుగా సహాయం చేసి పాఠశాల రుణం తీర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, పూర్వవిద్యార్థులు ఎన్.శివశంకర్, జి.ఆదినారాయణ, సాంబిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ పై పరిశీలన

ప్రజాశక్తి-పెదకూరపాడు

ఆరోగ్యశ్రీ కార్డులో పంపిణీని పెదకూరపాడు మండల అభివృద్ధి అధికారి మల్లేశ్వరి పరిశీలించారు బుధవారం పెదకూరపాడు మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో పెదకూరపాడు రెండు, మూడు సచివాలయాల్లో ఆమె తనిఖీ చేశారు. సకాలంలో ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని ఆమె ఆదేశించారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
గురువారం 22 ఫిబ్రవరి 2024

తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు

- నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర ప్రజలకు త్రాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా, రానున్న వేసవిని దష్టిలో ఉంచుకొని స్వచ్ఛమైన తాగునీటిని సరిపడా సరఫరా చేయటానికి నగరంలోని రిజర్వాయర్లు, సంపుల క్లీనింగ్, మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టామని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. బుధవారం హెడ్‌వాటర్ వర్క్స్, బి.ఆర్ స్టేడియం, నల్లచెరువు రిజర్వాయర్ల క్లీనింగ్‌ను మేయర్ స్వయంగా పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. స్వచ్ఛమైన త్రాగునీరు సరఫరా చేయటంలో భాగంగా తాగు నీటిపై ప్రజలలో నెలకొన్న కొన్ని అపోహలు తొలగించడం కోసం గుంటూరు నగరానికి ప్రధానంగా త్రాగునీరు సరఫరా చేసే తక్కెళ్ళపాడు హెడ్ వాటర్‌వర్క్స్‌లోని 42 యం.యల్.డి ప్లాంట్, నగరంలోని శ్రీనివాసరావుపేట, నల్లచెరువు, బి.ఆర్ స్టేడియం, తారకరామ నగర్, ఐ.పి.డి కాలనీ, ఆటోనగర్, ఏటుకూరు ల యందలి రిజర్వాయర్లను, సంపులను బుధవారం యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేయించడం జరిగిందన్నారు. తాగునీటి సరఫరాపై ప్రజలనుండి ఎటువంటి ఫిర్యాదు రాకూడదని, ఫిర్యాదులు ఏమైనా అందినట్లయితే, వెంటనే స్పందించి సదరు సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు తాగునీటి సరఫరాలో అలసత్వం వహించవద్దని, ఎవరైనా అలసత్వం ఊహించినట్లయితే అటువంటి వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో యస్ఈ సుందర రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రిజర్వాయర్ల క్లీనింగ్‌ను పరిశీలిస్తున్న మేయర్

23, 24 తేదీల్లో తాగునీటికి అంతరాయం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరములో తక్కెళ్ళపాడు హెడ్‌వాటర్ వర్క్స్‌లోని 45 ఎంఎల్డీ ఫిల్టరేషన్ ప్లాంట్ వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం త్రాగునీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు జిఎంసి ఎస్ఈ సుందరరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రము నుండి శనివారం ఉదయం వరకు గుంటూరు నగరంలోని రాజీవ్‌గాంధీ నగర్, వసంతరాయపురం, హనుమయ్యనగర్, నెహ్రూనగర్, శారదాకాలనీ రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు పాక్షికంగా అంతరాయము ఏర్పడుతుందని తెలిపారు. కావున ఆయా ప్రాంతాల ప్రజలు గుంటూరు ముందస్తుగా తగిన ఏర్పాట్లు చేసుకొని సహకరించాలని కోరారు.

రేపు ప్రాంతీయ, గ్రామీణ బ్యాంకుల సమ్మె

ప్రజాశక్తి-గుంటూరు

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, దేశ వ్యాప్తంగా అన్ని ఆర్ఆర్‌బిలను విలీనం చేయటం ద్వారా నేషనల్ రూరల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటుకు మద్దతుగా ఆండియా రీజనల్ రూరల్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ దేశవ్యాప్త పిలుపు మేరకు ఈనెల 23న చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అన్ని బ్రాంచిల్లో సమ్మె నిర్వహిస్తున్నట్లు సిజిజిబి ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బోడా శ్రీనివాసరావు, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మహ్మద్ మజీద్, ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎమలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మెరోజు సిజిజిబికి చెందిన అన్ని కార్యాలయాలు మూతబడతాయిని చెప్పారు. ఆర్ఆర్‌బిలలో సరైన మ్యాన్‌పవర్ ప్లానింగ్, సర్వీసు రూల్స్ సవరణ, పార్ట్‌టైమ్ వర్కర్ల క్రమబద్ధీకరణ, పూర్తి స్థాయి వేతన నిర్మాణం, పింఛను సమానత్వాన్ని సక్రమంగా అమలు చేయటం, సర్వీసు రూల్స్ ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, కంప్యూటర్ ఇంక్రిమెంట్ తదితర డిమాండ్లతో ఈ సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం స్పందించకుంటే మార్చిలో రెండ్రోజుల సమ్మె చేస్తామని నాయకులు హెచ్చరించారు.



మాట్లాడుతున్న నేతాజీ

సమ్మె ఒప్పందాలను అమలు చేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

42 రోజుల పాటు అంగన్‌వాడీలు, ఆయాలు పోరాడి సాధించుకున్న డిమాండ్లను ప్రభుత్వం వెంటనే జిఓ ఇచ్చి సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని జిల్లా అంగన్‌వాడీ వర్కర్ల గౌరవాధ్యక్షులు (సిఐటియు) వై.నేతాజీ డిమాండ్ చేశారు. బుధవారం ప్రకాష్‌నగర్ సిఐటియు కార్యాలయంలో అంగన్‌వాడీ యూనియన్ మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అంగీకరించిన అన్ని డిమాండ్లను వెంటనే కార్యరూపం దాల్చే విధంగా చూడాలన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎవిఎన్ కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం మాట మీద నిలబడి డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో అంగన్‌వాడీలు మళ్లీ పోరుబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు, నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, కె.తబిత, శశిరాణి, వెంకటలక్ష్మి, జసింత, తంబిరాణి, అన్నామణి, తిరుపతమ్మ, ప్రమీల, శ్రీదేవి, వెంకటేశ్వరమ్మ, కమల, కుమారి తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకులను కలిసిన కార్మికులు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని ఎసిసి సిమెంటు కార్మికులు బుధవారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనేక సంవత్సరాల నుండి తమ తండ్రులు, తాతలు ఇక్కడే పనులు చేసి కాలం చేశారని వివరించారు. ఫ్యాక్టరీ మూతబడిన తరువాత తమకు చట్టపరంగా రావాల్సిన ఆర్థిక సాయం నేటి వరకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీల చట్టం ప్రకారం తమకు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించలేదని చెప్పారు. జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాన్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని బాధితులకు హామీనిచ్చారు.

పోటీ పరీక్షల ప్రత్యేక పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

తెలుగు మరియు సంస్కృతి విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో తీసుకువచ్చిన పోటీ పరీక్షల పుస్తకాన్ని బుధవారం వర్సిటలో విసి పి రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సోషియాలజీ సోషల్ వర్క్ విభాగ అధ్యాపకులు ఆచార్య. కొలుసు ధనలక్ష్మి, శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు ఆచార్య జి. వెంకటరమణ, వర్సిటి అధ్యాపకులు ఆచార్య సాయి సుజాత, నాగార్జున యూనివర్సిటి సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగ అధిపతి ఆచార్య. వి.వెంకటేశ్వర్లు, సామాజిక శాస్త్రాల డీన్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు భారతీయ సమాజం అనే పోటీ పరీక్షల పుస్తకాన్ని రచించారు. ఈ సందర్భంగా ఆచార్య రాజశేఖర్ మాట్లడుతూ ఇలాంటి పుస్తకాలు మరెన్నో విద్యార్థులకు ఉపయోగపడేలా రచనలను తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆచార్యులు ధనలక్ష్మి, వెంకటేశ్వర్లు, త్రిముర్తి రావు, పరిశోధకులు, బి. కొటి, రాజశేఖర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పోటీ పరిక్షల పుస్తకం తెలుగు మరియు సంస్కృత అకాడమి సహకారంలో తీసుకువచ్చారు.

అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాతృ భాషా దినోత్సవం

ప్రజాశక్తి తెనాలి :అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం తెలుగు భాష ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగు భాషా పండితులు తాడికొండ సాయిబాబా పాల్గొని మాట్లాడుతూ తేనెలొలుకు తెలుగు భాష మాధుర్యం ఎంతో గొప్పదన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ ఐక్యవేదిక చైర్మన్ అక్కిదాసు కిరణ్ కుమార్ మాట్లాడుతూ పిల్లలకు తెలుగు భాషలోనే అమ్మ అనే మొదటి పదము నేర్పాలన్నారు. జన శిక్షణ సంస్థ కోఆర్డినేటర్ నాగభూషణం మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా తెలుగు భాష ఎంతో ప్రాముఖ్యత పొందిందని తెలుగు మన సమాజానికి వెలుగు లాంటిదని అన్నారు. కార్యక్రమంలో యేల్చూరి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు నాగలక్ష్మి వ్యాసరచన పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రశంస పత్రము, టైలరింగ్ నేర్చుకున్న ప్రతి ఒక్క మహిళకు ప్రశంస పత్రాన్ని అందించారు.

చలో సెక్రటేరియట్ జయప్రదం చేయండి

ప్రజాశక్తి పొన్నూరు రూరల్ :డీఎస్సీ పేరిట నిరుద్యోగుల్ని వంచించిన పాలక వైసిపి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఛలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పొన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కా రవీంద్రనాథ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు షర్మిలా నేతత్వంలో గురువారం జరుగు సచివాలయ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలలో పొన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కా మాట్లాడుతూ దగా డీఎస్సీ వద్దు మెగా డీఎస్సీ కావాలంటూ గురువారం చేపట్టిన ఛలో సెక్రటేరియట్ కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'వైసీపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం'

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లి పట్టణంలోని గౌడ కమ్యూనిటీ హాల్‌లో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కారంపూడి అంకమ్మరావు, తాడేపల్లి పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు చల్లా శ్రీనివాస్, తాడేపల్లి రూరల్ బీసీ సెల్ అధ్యక్షులు చావలి సురేష్ ఆధ్వర్యంలో బుధవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ బీసీల ద్రోహి సీఎం జగన్మోహన్‌రెడ్డి అని, ఆయన పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. బీసీలను జగన్‌రెడ్డి ఓటు యంత్రాలుగా మాత్రమే చూస్తున్నారని మండిపడ్డారు. రూ.75 వేల కోట్ల బీసీ సబ్ ప్లాన్ నిధుల్ని దారి మళ్లించిన ద్రోహి జగన్ రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అరాచక పాలనను ప్రజలు గ్రహించారని, వారిలో తిరుగుబాటు మొదలైందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. గుంటూరు పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రభుత్వంలో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వలేదని, ప్రతి ఒక్కరికి అన్యాయమే జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ ,తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, రూరల్ అధ్యక్షులు అమరా సుబ్బారావు, రాష్ట్ర బీసీ విభాగం ప్రధానకార్యదర్శులు మల్లెల ఈశ్వరరావు, ఇనకొల్లు భగత్ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని గాలిగోపురం సెంటర్లో గల వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళావేదికలో బుధవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ గంజి చిరంజీవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చివరి దశ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

ఎంటిఎంసి కార్యాలయంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఇన్చార్జి గంజి చిరంజీవి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంగళగిరి కార్పొరేషన్ పరిధిలో తుది దశకు చేరుకున్న పలు అభివృద్ధి పనులను గురించి ఇంజనీరింగ్ విభాగం అధికారులతో చర్చించారు. తుది దశకు చేరుకున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని, ఎవరికి ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఎట్టి పరిస్థితుల్లో అభివృద్ధి పనులు ఆగకూడదని కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే ఆర్కే సూచనలు చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వి నిర్మల కుమార్, ఇంజనీరింగ్ అధికారులు, వివిధ శాఖల చెందిన అధికారులు పాల్గొన్నారు.

నేడు వెలగపూడి సచివాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ధర్నా

ప్రజాశక్తి-మంగళగిరి



దగా డీఎస్సీ వద్దు.. మెగా డీఎస్సీ ముద్దు.. అన్న నినాదంతో ఏపీసిసి అధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో విజయవాడ నుంచి వెలగపూడి సచివాలయానికి నిరసన ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని యువజన కాంగ్రెస్ మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తాయి సుధీర్ తెలిపారు. 22న జరగనున్న ఈ నిరసన కార్యక్రమానికి మంగళగిరి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. డీఎస్సీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడ నాడే వరకు పోరాటం ఆగబోదని హెచ్చరించారు. నిరుద్యోగులను ఏపీ ప్రభుత్వం చేసిన మోసాన్ని కాంగ్రెస్ పార్టీ తరపున విస్తృతంగా క్షేత్రస్థాయి నుండి ప్రజల్లోకి తీసుకు వెళ్తామని ఈ సందర్భంగా సుధీర్ స్పష్టం చేశారు.

గంజాయి వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి - చేబ్రోలు

మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని పొన్నూరు రూరల్ సిఐ కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. గంజాయిని వినియోగించినా, విక్రయించినా తీవ్రమైన నేరంగా పరిగణించి చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి వినియోగించిన విక్రయించిన తీవ్రమైన నేరంగా పరిగణించడం జరుగుతుందని అన్నారు. ఈ విషయంలో పోలీసు రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. పోలీసులకు ముందుగా రాబడిన సమాచారం మేరకు మంగళవారం చేబ్రోలులో గురు శెట్టి అనే వ్యక్తి నుండి కేజీ గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. కేసుకు సంబంధించి వివరాలను సిఐ



కోటేశ్వరరావు వివరాలు తెలిపారు. గురుశెట్టి ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తి అని, ఇతను తల్లిదండ్రులతో కలిసి సుమారు రెండు సంవత్సరాల క్రితం చేబ్రోలు మండలానికి బతుకుతెరువు నిమిత్తం వచ్చి స్థానిక లక్ష్మీ గోదావరి స్పిన్నింగ్ మిల్లు పనిచేస్తున్నాడు. గంజాయి తాగటానికి అలవాటు పడిన క్రమంలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మరో వ్యక్తి సోమనాథ్ అనే వ్యక్తితో పరిచయమైంది. ఇద్దరు కలిసి ఒడిశా నుండి గంజాయి తెచ్చి ఇద్దరూ కలిసి గంజాయి తాగుతూ బానిసలుగా మారి, చేబ్రోలు చుట్టుపక్కల స్పిన్నింగ్ మిల్‌లో గంజాయి అమ్ముతున్నారు. ఈ క్రమంలోనే గత ఒక వారం రోజుల క్రితం సోమనాథ్ ఒక కేజీ గంజాయిని తెచ్చి పలాసకు చెందిన కొత్త రెడ్డిపాలెంలో నివాసం ఉంటున్న కన్ను బాలకృష్ణకి విక్రయించడానికి ఇచ్చాడు. విస్వసనీయ సమాచారం మేరకు పొన్నూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వై. కోటేశ్వరావు, చేబ్రోలు ఎస్ఐ పి మహేష్ కుమార్ మరియు సిబ్బంది బాలకృష్ణను అదుపులోకి తీసుకుని అతని వద్దనుండి కేజీ గంజాయిని, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్ బాలకృష్ణ పరారయ్యాడు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

3వ తేదీన పల్స్‌పోలియో


మాట్లాడతున్న డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో 0–5 ఏళ్ళ వయస్సు కలిగిన పిల్లలందరికీ మార్చి 3వ తేదీన జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో పోలియో చుక్కలు వేయిం చటానికి వైద్య, ఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవా లని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి అన్నారు. ఈ మేరకు జిఎంసి పరిధిలో పల్స్‌పోలియో ఏర్పాట్లపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ గుంటూరు నగర పరిధిలో 0–5 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన పిల్లలు 90,707 మంది ఉన్నారని, వారికి 284 బూత్‌లలో పోలియో చుక్కలు వేయటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 27 మంది రూట్ ఆఫీసర్లు, 1150 మంది వేక్సినేటర్లను కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొంటారన్నారు. జిఎంసి పరిధిలోని మురికి వాడలు, భవన నిర్మానాలు జరిగే ప్రదేశాలు, సంచార జాతులు నివశించే ప్రాంతాలు వంటి 66 హైరిస్క్ ప్రాంతాలను గుర్తించినట్లు చెప్పారు. కావున తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక శాఖ అధికారి డాక్టర్ కె.వి.సుబ్బరాజు, స్టేట్ రిసోర్స్ పర్సన్ సందీప్ పాటిల్, డాక్టర్ ఎ.శ్రావణబాబు, డాక్టర్ సిహెచ్.రత్నమన్మోహన్ పాల్గొన్నారు.

ఆలోచనాశక్తితో విప్లవాత్మక విజయాలు


జయచంద్రరావును సన్మానిస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో బుధవారం 'సంథింగ్ డీప్లి హిడెన్ ఆణ్ మెటాకాగ్నిషన్' అనే అంశంపై మైండ్ యువర్ ఫాటమ్స్ సిఇఒ జయచంద్రరావు విచ్చేసి ఒక మనిషి ఆలోచనా ప్రక్రియల గురించి అవగాహన, వాటి వెనుక ఉన్న నమూనాల గురించి విద్యార్థులకు వివరించారు. జయచంద్రరావు మాట్లాడుతూ మెటాకాగ్నిషన్ అనేది నేర్చుకోవటంలో రూపొందించబడిన ఆలోచనా అభ్యాసంపై నియంత్రణను కలిగి ఉండే ఉన్నత స్థాయి ఆలోచనను సూచిస్తుందన్నారు. ఒకరి ఆలోచనా విధానాలను ప్రతిబింబించటం, సమస్య పరిష్కారానికి నిర్దిష్ట వ్యూహాలను ఎప్పుడు, ఎలా ఉపయోగించి, ఆచరించాలో తెలుసుకోవటం గురించి చెబుతుందన్నారు. ఈ మెటాకాగ్నిషన్ అనేది నేర్చుకోవటంలో నిమగ్నమైన అభిజ్ఞ ప్రక్రియలపై క్రియాశీల నియంత్రణను కలిగి ఉంటుందన్నారు. చాలా మంది విద్యార్థులు చదివేటప్పుడు నేర్చుకున్న వాటిని అర్థం చేసుకునే ప్రక్రియను ఎదుర్కొంటారన్నారు. ఇలాంటి సమయంలో ఈ మెటాకాగ్నిషన్ అభ్యాసకుడికి స్వీయ అవగాహన, స్వీయ పర్యవేక్షణగా పనిచేస్తుందన్నారు. అంటే ఆలోచించటం గురించి ఆలోచిస్తుందని, తద్వారా ఏదైనా సమస్యకు సత్వర పరిష్కారం అతి తక్కువ సమయంలో లభిస్తుందన్నారు. ఈ సామర్థ్యంతో విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాలను, నైపుణ్యంగానీ, పనితీరును పొందటంలో సహాయ పడుతుందని, ఇది విద్యాపరమైన విజయానికి దారి తీస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు పాల్గొన్నారు.


జెకెసి కళాశాలలో ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

జెకెసిలో తెలుగు లిపి మార్పులపై ప్రదర్శన

ప్రజాశక్తి-గుంటూరు :అంత ర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జెకెసి కాలేజి గ్రంథాలయంలో తెలుగు లిపి మార్పులను సూచిస్తున్న గోడప్రతుల ప్రదర్శనను నిర్వహించారు. భాషా లిపి పట్టికలు, వలపల గిలకను, మారిన, మారుతున్న కాలక్రమంలో మారబోతున్న అక్షరాల ప్రదర్శన పట్ల విద్యార్థులకు అవగాహన కోసం తెలుగు, ప్రాచ్యభాషా విభాగం, గ్రంథాలయ శాఖ సంయుక్తంగా ఈ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను కళాశాల పాలక మండలి సభ్యులు కుప్పుస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నాగేశ్వర రావు, యస్.ఆర్.కె.ప్రసాద్, గోపిచంద్, విద్యార్థులు ప్రదర్శనను తిలకించారు. గోడప్రతులలోని అంశాలను సేకరించి, తయారు చేసిన పులిచర్ల శ్రీకాంత్‌ను కళాశాల యాజమాన్యం సన్మానించింది.

టిజెపిఎస్ కాలేజీలో మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

టిజెపిఎస్ కాలేజీలో మాతభాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎబిపి మనోహర్ మాట్లాడుతూ మాతృభాషలో విద్యాబోధన అర్థమైనంతగా మరే ఇతర భాషల్లో అర్థం కాదని, గిడుగు రామ్మూర్తి వంటి వారి వలన కనీసం భాష బతికి ఉందని చెప్పారు. దేనికైనా భావం ప్రధానమైనదని, ఆ భావాన్ని స్వచంగా ప్రకాశింపచేసే భాష మాతృభాష మాత్రమే అని చెప్పారు. మాతృభాషలో మన సంస్కృతి, సంప్రదాయం, ఆచారాలు ఉన్నాయని, భాష లేకపోతే ఇవన్నీ కోల్పోయి మానవ సంబంధాలు, విలువలు విచ్ఛిన్నం అవుతాయని, కాబట్టి మాతృ భాషా పరిరక్షణ మన బాధ్యతని చెప్పారు. కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్, డాక్టర్ ఏ.అంజనీ కుమార్, కె.శ్రావణి, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ మనోహర్

మల్లికా స్పైయిన్‌కు జాతీయ, రాష్ట్ర అవార్డులు

ప్రజాశక్తి-గుంటూరు :ప్రముఖ సీనియర్ స్పైయిన్ సర్జన్, మల్లిక స్పైయిన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ జె.నరేష్ బాబును అసోసియేషన్ ఆఫ్ స్పైయిన్ సర్జన్స్ ఆఫ్ ఇండియా నేషనల్ బెస్ట్ రీసెర్చ్ అవార్డుతో సత్కరించింది. అలాగే సర్వైకల్ స్పాండిలైటిస్‌పై మల్లిక స్పైయిన్ చేసిన అసాధారణ పరిశోధన కోసం ఆంధ్రప్రదేశ్‌లోని ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ ద్వారా ప్రతిష్టాత్మక వ్యాగ్రేశ్వర్డుడు బంగారు పతకాన్ని కూడా పొందింది. డాక్టర్ నరేష్ సంచలనాత్మక అధ్యయనం ప్రకారం మెడలో స్పాండిలైటిస్ లక్షణాలు ఉన్నప్పటికీ ఎంఆర్‌ఐలో ఎటువంటి లోపాలు లేని 50 మంది రోగులపై దృష్టి సారించింది. వీరందరికీ పడుకొని తీసుకున్న ఎంఆర్‌ఐతోపాటు కూర్చొని ఉన్నప్పుడు, మెడ ముందుకు, వెనకకు వంచినప్పుడు ఎంఆర్‌ఐ పరీక్ష నిర్వహించారు. ఈ విధానం ద్వారా రోగి తల బరువు, కూర్చున్నప్పుడు కలిగే రోజువారీ కదలికల ప్రభావం మెడలోని నరాలపై ఏ మేరకు అదనపు ఒత్తిడిని కలిగిస్తుందో పరిశీలించారు. అనూహ్యంగా వారందరిలో కూర్చుని ఎంఆర్‌ఐ స్కాన్ చేసినప్పుడు నరాలపై తీవ్రమైన ఒత్తిడి కలగటం గుర్తించారు. ఈ విషయాలను ప్రపంచంలోనే మొదటిసారిగా ఈ పరిశోధనలో కొనుగొన టం విశేషం. గత నెలలో ముంబైలో జరిగిన అసోసియేషన్ ఆఫ్ స్పైయిన్ సర్జన్స్ ఆఫ్ ఇండియా(ఎఎస్ఎస్ఐ) వార్షిక సదస్సులో ఈ పరిశోధనా పత్రానికి డాక్టర్ నరేష్‌కు ఎఎస్–ఎస్ఐ బెస్ట్ రీసెర్చ్ అవార్డు అందజేసింది. అంతే కాకుండా తిరుపతిలో జరిగిన అర్థోపెడిక్ సర్జన్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఓఎస్ఎస్ఎపి) వార్షిక సమావే శంలో ఈ అధ్యయనాన్ని ప్రదర్శించారు. ఇందుకు 2024కు ఉత్తమ పేపర్ ప్రజంటేష న్‌గా వ్యాగ్రేశ్వరుడు పతకాన్ని గెలుచుకుంది. ఈ పరిశోధనలో మల్లికా స్పైయిన్ సెంటర్‌కు చెందిన డాక్టర్ పృథ్వీ కుమార్‌రెడ్డి, డాక్టర్ గజేంద్ర, డాక్టర్ ప్రజ్వల్ పాల్గొన్నారు. రోగి పడుకొని ఉన్నప్పుడు ఎటువంటి నొప్పి రాదని, కూర్చోవటం, నిలబడటం, నడవటం మాత్రమే వారికి నొప్పిగా ఉంటుందని, మల్లికా స్పైయిన్ సెంటర్‌లో అందుబాటులోకి వచ్చిన డైనమిక్ ఎంఆర్‌ఐ ద్వారా నిలబడి, కూర్చొని, వంగి, కదలికలలో కూడా ఎంఆర్‌ఐ నిర్వహించే సౌలభ్యం ఉందని డాక్టర్ నరేష్ వెల్లడించారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ నరేష్

సిద్ధార్థా గ్యాస్ట్రో కేర్ హాస్పటల్ ప్రారంభం

దురలవాట్లకు దూరంగా ఉండండి : డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

ప్రజలు మంచి ఆహార అలవాట్లను అలవర్చుకోవడం ద్వారానే గ్యాస్టిక్ సమస్యల నుంచి బయటపడతారని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు, హైదరాబాద్ ఎఐజి ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డిచెప్పారు. స్థానిక గుంటూరు వారితోటలో నూతనంగా ఏర్పాటు చేసిన సిద్ధర్థ గ్యాస్ట్రో కేర్ హాస్పటల్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ గుంటూరులో పూర్తిస్థాయిలో ఈ ఆస్పత్రి ఏర్పాటు కావడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగం అన్నారు. ప్రజలు స్పైసీ ఆహారాన్ని తీసుకోవడం తగ్గించాలని, ఆల్కహాలు, స్మోకింగ్‌కు దూరంగా ఉండాలని, వీలైనంత వరకు బయట ఆహారాన్ని తగ్గించాలని సూచించారు. డాక్టర్లు ప్రతిరోజూ రీసెర్చ్ చేస్తూ రోగుల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. వైద్యాన్ని సేవాభావం తో చేస్తే రోగులకు డాక్టర్ల పట్ల గౌరవం పెరుగుతుందన్నారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు అనేక రకాల గ్యాస్టిక్ సమస్యలతో బాధపడుతున్నారని ఆధునిక పద్ధతిలో చికిత్సలకు గుంటూరులో ఇలాంటి ఆస్పత్రులు రావడం ఎంతో మేలు అన్నారు. ప్రముఖ ఆర్థోపోడిక్ వైద్యులు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ గుంటూరులో గ్యాస్టిక్, లివర్ సమస్యలకు అధునాతన వైద్య సేవలందించేందుకు ఇలాంటి ఆస్పత్రి అందుబాటులోరావడం ముదావాహం అన్నారు. ఆస్పత్రి అధినేత డాక్టర్ ఆళ్ల సిద్ధార్థ మాట్లాడుతూ తాను ప్రొఫెసర్ నాగేశ్వరరెడ్డి వద్ద ఎంతో శిక్షణ పొందానని, ఆయన సూచనలమేరకు ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తానని, తమ ఆస్పత్రిలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ కావటి మనోహర్ నాయుడు,ఎమ్మెల్యేలు మేకతోటి సుచరిత, ముస్తాఫా, మద్దాలి గిరిధర్, ఎమ్మెల్సీ లేళ్లఅప్పిరెడ్డి, ఎపి క్రిడాయ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీమంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, డొక్కా మాణిక్య వర ప్రసాద్, ప్రముఖ వైద్యులు డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి, వై.లక్ష్మణస్వామి, వి.రామ తారకనాథ్, సూరత్ అమరనాథ్, బయ్యా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


హాస్పిటల్‌ను ప్రారంభించిన డాక్టర్ నాగేశ్వరరెడ్డి

సిఎంఎ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సిఎంఎ ఫైనల్, ఇంటర్ ఫలితాలలో శ్రీమేధ విద్యార్థులు ఆలిండియా టాప్ ర్యాంకులతోపాటు, అత్యధిక పాస్ పర్సంటేజి సాధించారని సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 19 సంవత్సరాలుగా సిఎ, సిఎంఎ కోర్సులలో 400లకుపైగా ఆలిండియా ర్యాంకులు సాధించామన్నారు. సిఎంఎ ఫైనల్ విభాగంలో పి.లోకేష్ ఆలిండియ 4వ ర్యాంకు, చందా పవన్‌కుమార్ 17వ ర్యాంకు, ఎ.పవన్ కళ్యాణ్ 31వ ర్యాంకు, డి.శ్రీహరిరెడ్డి 47వ ర్యాంకు సాధించారని తెలిపారు. అలాగే సిఎంఎ ఇంటర్ విభాగంలో బొల్లా పల్లవి 27వ ర్యాంకు సాధించినట్లు వెల్లడించారు. ఈ ఘనత సాధించటానికి కారణమైన అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం సహకారం ఎంతో ఉందన్నారు. టాపర్లను అన్నా నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి, అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నందకిషోర్

గల్ఫ్ ఫుడ్ ఫెస్టివల్‌లో డబుల్‌హార్స్ ఉత్పత్తులు

దుబాయ్ ట్రేడ్ సెంటర్‌లో ఈనెల 23 వరకూ ప్రదర్శన

వ్యాపార రంగంలో ప్రపంచస్థాయికి చేరిన డబుల్‌హార్స్

ప్రజాశక్తి-తెనాలి

డబుల్‌హార్స్ మినపగుళ్ల వ్యాపార రంగంలో తెనాలి కీర్తి ప్రపంచ స్థాయికి చేరిందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మునగాల శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెనాలి కేంద్రంగా ప్రారంభమైన సంస్థ దినదినాభివృద్ధి చెంది, ఇరు తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా దేశ విదేశాలకూ విస్తరించిందన్నారు. వ్యాపార రంగంలో 20 ఏళ్ళుగా సుదీర్ఘ అనుభవం గడించిన పట్టణానికి చెందిన తెనాలి డబుల్ హార్స్ ఉత్పత్తులు దుబాయ్ ట్రేడ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న గల్ఫ్ ఫుడ్ ఫెస్టివల్‌లో విశేష ఆదరణ పొందాయని తెలిపారు. తెనాలి డబుల్ హార్స్ సంస్థ వ్యాపార రంగంతో పాటు ఆహార ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉందని, ఆహార ఉత్పత్తులను పెందదని, ప్రపంచంలోని పలు దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోందని తెలిపారు. దేశ విదేశాలకు తెలుగువారి రుచులను చాటుతోందన్నారు. ఈనెల 19 నుంచి దుబాయ్ ట్రేడ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న 22వ గల్ఫ్ ఫుడ్ ఫెస్టివల్‌లో తెనాలి డబుల్ హార్స్ సంస్థ ఆహార ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో పలు దేశాలకు చెందిన సంస్థలు తమ ఆహార ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నాయి. వారిలో తెనాలి డబుల్ హార్స్ సంస్థ పాల్గొనటం తమ సంస్థకు గర్వకారణమన్నారు. 50 రకాల ఉత్పత్తులను ప్రదర్శనగా ఉంచిందని,. పప్పులు, ఇన్‌స్టెంట్ పొడులు, స్వీట్స్, రెడీ టు కుక్, రెడీ టు ఈట్ (మీల్స్), చిక్లెట్స్, స్పైసెస్, పికిల్స్, మిల్లెట్స్ వంటివి ప్రదర్శనలో ఉంచారు. దాదాపు 127 దేశాలకు చెందిన ఆహార ప్రియులు ఈ ఫుడ్ ఫెస్టివల్‌ను వీక్షిస్తున్నారు. ఫుడ్ ఫెస్టివల్ ఆహార ప్రియుల భవిష్యత్ అవసరాలను అర్థం చేసుకునేందుకు, వారి డిమాండ్‌కు తగినట్టుగా వ్యాపార విస్తరణకు ఎంతగానో ఉపయోగ పడుతుందని సంస్థ ఎండి మునగాల శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ ప్రదర్శన ద్వారా తమ సంస్థ ఉత్పత్తులు వివిద దేశాల ప్రతినిధులకు, ప్రతినిధులకు చేరువయ్యాయని, అవి వారిని విశేషంగా ఆకర్షించాయని ఆయన చెప్పారు. భవిష్యత్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యాపారాన్ని విస్తరింప చేస్తామన్నారు.



గల్ఫ్ ఫుడ్ ఫెస్టివల్‌లో డబుల్ హార్స్ ఉత్పత్తుల ప్రదర్శన